సాక్షి
ఖమ్మం

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



ప్ర'యోగం' ఉన్నట్లే..

జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ల్యాబ్‌ల నిర్వహణకు రూ.25 వేల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 8లో



ఆవిర్భావం అదిరేలా..!

సింగరేణి ఆవిర్భావ వేడుకల కోసం కొత్తగూడెం ప్రకాశం స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

డీఈఓ సోమశేఖరశర్మ



విజేతలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న బాధ్యులు

ఖమ్మంరూరల్ : దేశానికి శాస్త్రవేత్తల అవసరం ఎంతో ఉందని, ఆసక్తి గల విద్యార్థులు ఆ దిశగా తమ లక్ష్యాలను ఎంచుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. మండలంలోని పోలేపల్లిలో గల గురుదక్షిణ ఫౌండేషన్‌లో గణిత మేధావి శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా మొత్తం 59 పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన వృత్తిని ఎంచుకోవాలని, పరిశోధనల రంగం వైపు ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విజేతలకు సైకిళ్లు, గడియారాలు, డిజిటల్ ట్యాబ్‌లు బహుమతులుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్, శంకరయ్య, పి. వెంకటేశ్వర రావు, డి. భిక్షమయ్య, సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం

ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ



విద్యార్థినులతో కలిసి టిఫిన్ చేస్తున్న సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన ఖమ్మంలోని ఎస్సీ బాలికల ఏ వసతిగృహంలో విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేసి, హాస్టల్‌లో మోడల్ స్టోర్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతీ రోజు ఉదయం అల్పాహారం, రాగిజావ, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, గుడ్లు, పండ్లు అందజేస్తున్నామని వివరించారు. వీటితో పాటు భోజనంలో మాంసాహారం ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందించామన్నారు. ఆయన వెంట వసతిగృహ సంక్షేమ అధికారిణి ఎస్.విజయ ఉన్నారు.

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



నత్తనడకన వసూళ్లు



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుల వివరాలు.. (రూ. కోట్లలో)

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	లక్ష్యం	వసూలు
ఖమ్మం	32	15.04
మధిర	2.49	1.05
సత్తుపల్లి	4.79	2.35
వైరా	2.45	75.43 లక్షలు
కొత్తగూడెం	47.81	29.78
పాల్వంచ	6.00	3.30
ఇల్లెందు	26.52	11.33
మణుగూరు	1.42	75.50 లక్షలు

కేఎంసీ నిర్వహణలో పన్నులదే సింహభాగం

- ఇతర మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి
- కానీ సర్వేలు, ఇతర విధులతో సిబ్బంది బిజీ
- పన్నుల వసూలుపై దృష్టి సారించలేకపోతున్న వైనం
- కేఎంసీలో రూ.34 కోట్ల లక్ష్యానికి రూ.16.18 కోట్లే వసూలు

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధి, నిర్వహణ అంతా వాటికి వచ్చే ఆదాయంపైనే ఆధారపడి ఉంటుంది. కార్పొరేషన్లకు ఆదాయ వనరులో ఆస్తి, పంపు పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్సుల ద్వారా వచ్చే ఫీజులే ప్రధానం. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో వచ్చే ఆదాయంలో ఆస్తి పన్నే కీలకంగా ఉంటుంది. ఖమ్మం కార్పొరేషన్ 60 డివిజన్లలో విస్తరించి ఉండగా ఆస్తిపన్ను రూపంలో రూ.30 కోట్ల మేర ఆదాయం వస్తుంది. ఈ ఆదాయంతో ప్రతి నెల నిర్వహణకు ఖర్చు చేయడంతో పాటు చిన్న చిన్న అభివృద్ధి పనుల బిల్లులు చెల్లిస్తారు. ఏటా లక్ష్యాన్ని చేరుకునేందుకు నెలల వారీగా విభజించుకుని మరీ సిబ్బందితో క్షేత్ర స్థాయిలో పన్నులు వసూలు చేయిస్తుంటారు. కానీ ఈ ఏడాది మాత్రం అటు కేఎంసీ, ఇటు మున్సిపాలిటీల్లో పన్నుల వసూలు నత్తనడకన సాగుతోంది. దీంతో ఖజానాలు నిండుకుంటుండగా, నెలవారీగా వచ్చే ఆదాయం తగ్గుముఖం పడుతుండగా నిల్వ ఉన్న నిధులను ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.16.18 కోట్లు మాత్రమే వసూలు

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లలో అధికారులు పూర్తి స్థాయి దృష్టి సారించడం లేదనే చర్చ జరుగుతోంది. ఏటా పన్నుల వసూలుకు నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రతి రోజు పన్నుల వసూలు చేసేలా బిల్ కలెక్టర్లకు సూచనలు చేసేవారు. అయితే ఈ ఏడాది పలు కారణాలతో పన్నుల వసూలులో కేఎంసీ సిబ్బంది వెనుకబడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.16.18కోట్ల పన్నులు మాత్రమే వసూలు చేశారు. ఇందులో ఆస్తిపన్ను రూ.15.04 కోట్లు కాగా.. నల్లా పన్నులు రూ.84.65 లక్షలు, ట్రేడ్ లైసెన్సుల ఫీజు రూ.29.76 లక్షలుగా ఉంది. ఈ ఏడాది పన్నుల ద్వారా రూ.34 కోట్లకు పైగా వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకోగా.. అందులో ఆస్తి పన్ను ద్వారా రూ.32 కోట్లు వసూలు చేయాలి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల ఏప్రిల్ లో ఎర్లీ బర్డ్ ద్వారానే రూ.9.73 కోట్లు రాబట్టారు. ఆపై మే నెల నుండి ఇప్పటి వరకు రూ.5.31 కోట్లే వసూలు చేయగా మరో మూడు నెలల్లో ఆస్తి పన్ను రూపంలో ఇంకా సుమారు రూ.17 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

అదనపు పనులతోనే జాప్యం..

కేఎంసీతో పాటు మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లకు రెవెన్యూ విభాగం కీలకంగా ఉంటుంది. ఈ విభాగంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో బిల్ కలెక్టర్లు పన్నులు వసూలు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాల్లో మున్సిపాలిటీ సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. బిల్ కలెక్టర్లకు ఆయా కార్యక్రమాలకు సంబంధించిన విధులను కేటాయించడంతో పన్నుల వసూలపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. ఖమ్మంకు వచ్చేసరికి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వరద బాధితుల సర్వే, వారికి సహాయ కార్యక్రమాలు, ఇతర పనులపై దృష్టి పెట్టారు. ఇక నవంబర్‌లో అన్ని చోట్ల కుల గణన సర్వే, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలకు వీరినే ఉపయోగిస్తుండడంతో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతోంది.

ప్రణాళికలు లేకుంటే కష్టమే..

ఆస్తి పన్నుల వసూళ్లలో ఎర్లీ బర్డ్ స్కీం ఉండే ఏప్రిల్‌తో పాటు ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలలే కీలకం. ఎర్లీ బర్డ్ స్కీంలో ఈ ఏడాది ఆస్తి పన్నులను భారీగానే వసూలు చేసినా.. లక్ష్యం మాత్రం ఇంకా ఎక్కువగానే మిగిలి ఉంది. ఒక్క ఖమ్మం కార్పొరేషన్‌లోనే ఆస్తి, పంపు, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా ఈ ఏడాది ఇంకా రూ.18 కోట్ల వరకు వసూలు చేయాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇకనైనా ప్రణాళికాయుతంగా ముందుకు సాగకపోతే ఈ ఏడాది వెనుకబడే ప్రమాదముందని అధికారిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నగరాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన ఎంపీ తదితరులు

సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు

- నగరంలో నీటి సరఫరాకు రూ.220 కోట్లతో పనులు
- మున్నేరుకు రెండు వైపులా రిటైనింగ్ వాల్
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగరాభివృద్ధికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని 57వ డివిజన్ రమణగుట్టలో రూ.85 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు భూమి ఇచ్చిన మదన్‌కు ధన్యవాదాలు తెలిపారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఇళ్లు లేని పేదలకు సంక్రాంతి నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. హౌసింగ్ శాఖకు జిల్లాకు చెందిన మంత్రే ఉన్నందున ఖమ్మంలో ఎక్కువ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. అమృత్ పథకం నిధులు రూ.220 కోట్లతో నగరంలో నీటి సరఫరా పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వరదలతో ఖమ్మం నగరానికి ముంపు రాకుండా ఉండేందుకు రూ.250 కోట్లు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. మున్నేరుకు రెండువైపులా రిటైనింగ్ వాల్లు నిర్మిస్తామన్నారు. 500 ఎకరాల్లో ఉన్న వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ను నెహ్రూ జులాజికల్ పార్క్‌లా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లేదంటే వారిపైనే చర్య తీసుకుంటామని హెచ్చరించారు. రూ.249 కోట్లతో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయని అన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే ఎమ్మెల్యేను ఖమ్మం నియోజకవర్గంలో ఎన్నుకున్నారని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, కార్పొరేటర్లు రఫీదాబేగం, కమర్తపు మురళి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ ముస్తఫా, ఎల్ఐసీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్ –17 బాలికల క్రికెట్ జట్టును ఆదివారం ఎంపిక చేశారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్టు సభ్యులు పాల్గొంటారని పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహమూర్తి, వి.నరేష్ తెలిపారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 42 మంది హాజరయ్యారని, వీరిలో 20 మందిని క్యాంపునకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. కోచింగ్ క్యాంప్ అనంతరం తుది జట్టును ప్రకటిస్తామన్నారు. కోచింగ్ క్యాంప్‌నకు ఎంపికైన వారిలో వైష్ణవి, అనన్య, ఝాన్సీ, యశస్విని, యమున, నేహ, సాయి దీక్షిత, హిమవర్షిని, మాన్వి, గ్రీష్మ, వెన్నెల, శ్రీజ, రేవతి, శ్రీ హర్షిత, యశస్వి, మనస్వి, మేఘన, నిఖిత హెలెన్, గౌరీ మంజలి, తాజ్ అత్‌షా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, సంపత్, సైదేశ్వరరావు పాల్గొన్నారు.

31న అరుణోదయ స్వర్ణోత్సవ సభ

ఖమ్మం మామిళ్లగూడెం : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏర్పడి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఖమ్మం జిల్లా వైరాలో ఈనెల 31న స్వర్ణోత్సవ సభ నిర్వహించనున్నట్లు సంఘం భద్రాద్రి జిల్లా కార్యదర్శి ముత్యాలరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు యోగానందం, కార్యదర్శి గద్దం లక్ష్మణ్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. సభ సందర్భంగా వైరాలో భారీ ప్రదర్శన నిర్వహిస్తామని, అనంతరం గాంధీ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్‌లో కళాకారులతో ధూమ్‌ధామ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 1975 నుంచి నేటి వరకు వేలాది మంది కళాకారులు అరుణోదయ సంఘంలో పనిచేశారని, 50 సంవత్సరాల కాలంలో అనేక రుగ్మతలపై కళారూపాలు రూపొందించామని వివరించారు.



మాట్లాడుతున్న యోగానందం

శ్రీకాకుళం ఉద్యమంలో సుబ్బారావు పాణిగ్రాహి, చినబాబు, గోదావరి లోయ రైతాంగ పోరాటంలో అరుణోదయ రామారావు వంటి కళాకారులు తమ జీవితాలను ప్రజల కోసం అంకితం చేశారని, వారి ఆశయ బాటలో నేటి కళాకారులు పయనించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆరెంపల వెంకన్న, కత్తుల మల్లయ్య, మహంకాళి వెంకన్న, కొట్టె సీతారాములు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో సండే సందడి

- ఒకరోజు ఆదాయం రూ.32,785


పాల్వంచరూరల్ : పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు పొరుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 494 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.18,385 ఆదాయం లభించగా, 400 మంది బోటు షికారు చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.14,400 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం చేశారు. అనంతరం సువర్ణ పుష్పార్చన గావించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చైర్మన్ పీఠంపై ఉత్కంఠ?

- భద్రాచలం ట్రస్ట్ బోర్డు పదవి కోసం తీవ్ర పోటీ
- పాలక మండలి జాబితాలో చోటుపై టెన్షన్ టెన్షన్
- ముక్కోటి వేడుకల్లో అధికారిక హోదాలో పాల్గొనాలనే ఉత్సాహం



భద్రాచలం రామాలయం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం పాలక మండలి పీఠంపై ఉత్కంఠ నెలకొంది. సుదీర్ఘ కాలం తర్వాత పాలక మండలి ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఆశావాహులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. చైర్మన్, మండలి సభ్యుల్లో చోటుకోసం సుమారు 50కు పైగా దరఖాస్తులు ఖమ్మం దేవాదాయ శాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. గడువు ఈ నెల 15న పూర్తి కావడంతో ఆ శాఖ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారు సమర్పించిన డేటాను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే దరఖాస్తుల జాబితాను దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపనున్నారు. అనంతరం దేవా దాయ శాఖ మంత్రి పరిశీలించి తుది జాబితాను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించి చైర్మన్‌తోపాటు సభ్యుల పేర్లను ప్రకటించే అవకాశంఉంది. మరో పది రోజు ల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రేసులో మల్లు నందిని, బాలసాని?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ట్రస్ట్ బోర్డు నియమకానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోటోకాల్ ఉన్న చైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రభుత్వం సైతం నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా పార్టీలకు సేవలందించిన, పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తులకు చైర్మన్ పదవి కేటాయించాలని భావిస్తోంది. దీంతో పలువురు తమ పరపతి, పలుకుబడితో రాష్ట్రస్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాకు చెందిన ఓ మంత్రి ఆశీస్సులతో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ చైర్మన్ రేసులో ఉన్నట్లు కొద్దికాలంగా ప్రచారం సాగుతోంది. భద్రాచలం కేంద్రంగా రాజకీయ అనుభవం, స్థానికత ఆధారంగా ఆయన చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి మల్లు విక్రమార్క సతీమణి మల్లు నందిని కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారనే ప్రచారం వారం రోజులుగా సాగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి భట్టి విక్రమార్కకు జిల్లా వ్యాప్తంగా అనుచరగణం మద్దతు సైతం ఉంది. ఖమ్మం ఎంపీ సీటును కూడా ఎన్నికల్లో త్యాగం చేయటంతో ప్రొటోకాల్, ఆధ్యాత్మికత ప్రాముఖ్యం ఉన్న రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవి మల్లు నందినిని వరించే అవకాశం ఉందనే చర్చ కూడా నడుస్తోంది. వీరితోపాటు ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థలో వరంగల్ ప్రతినిధిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి, రామాలయం మాజీ పాలక మండలి సభ్యుడిగా పనిచేసిన ఓ ప్రముఖుడు మహబూబాబాద్ ఎంపీ ద్వారా లాబీయింగ్ చేస్తున్నారు.

దరఖాస్తుదారుల్లో టెన్షన్

పాలక మండలి జాబితాలో తమ పేరు వచ్చేనా? ఏ క్షణంలో ఏం జరుగుతుందో? అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. పట్టువీడకుండా హైదరాబాద్‌లోనే మకాం వేసి మంత్రులు, ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీ చేస్తున్నారు. కాగా జనవరి 9, 10వ తేదీల్లో తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం ఉత్సవాలు జరగనున్నాయి. జనవరి 1 నాటికి ట్రస్ట్ బోర్డు జాబితా వస్తే ప్రమాణ స్వీకారం అనంతరం ఆ హోదాలో ముక్కోటి ఉత్సవాల్లో పాల్గొనాలని తహతహలాడుతున్నారు.

క్లుప్తంగా

వెంకటస్వామికి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంసహకారనగర్: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా దేశానికి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కళావతిబాయి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కారుమంచి శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్ పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం అర్బన్ : తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీని ఆదివారం నగరంలోని బంజారాభవన్‌లో ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల గిరిజన ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి గంగావత్ శ్రీనివాస్ నాయక్ హాజరయ్యారు. కమిటీ అధ్యక్షుడిగా బాధావత్ శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శిగా జాటోత్ వీరన్న నాయక్, గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ హరికిషన్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భీంజీరావు, డాక్టర్ హరికిషన్, సేట్‌రామ్, నాగేశ్వరరావు, రమేష్ ,శ్రీను మోహన్, వీరు, వీరన్న, క్రాంతికుమార్, సురేష్, తులసీరామ్ పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీ విచారణ



వెంకటమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ప్రసాద్‌రావు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో వృద్ధురాలిపై దాడికి పాల్పడి చోరీ చేసిన ఘటనపై ఆదివారం అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాద్‌రావు విచారణ చేశారు. వృద్ధురాలు ఆరెంపుల వెంకటమ్మ నివాసం ఉంటున్న ఇంట్లోకి వెళ్లి దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి చుట్టు పక్కలవారితో మాట్లాడారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, ప్రజలు ధైర్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలు

ఖమ్మంక్రైం: టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి ఆధ్వర్యంలో సిబ్బంది నగరంలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్న, సేవిస్తున్న అడ్డాలను తనిఖీ చేశారు. నిషేధిత గంజాయి లాంటి మత్తు పదార్థులను విక్రయించడం, సరఫరా చేయడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను, అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. నగరంలోని రోటరీనగర్, యస్‌బీఐటీ కళాశాల పరిసరాలు, మమత వైద్య కళాశాల పరిసరాలు, శాంతినగర్ పాఠశాల పరిసరాలు, చర్చికాంపౌండ్, జహీరపుర, ప్రకాష్‌నగర్, ఎన్టీఆర్‌సర్కిల్, కొత్తబస్టాండ్, గట్టయ్యసెంటర్, సరిత క్లినిక్, సారథినగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

చింతకాని: మండలంలోని వందనం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి దానిలో ఉన్న కాపర్ వైరును అపహరించినట్లు ఏఈ చావా శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

ఖమ్మంక్రైం: పోలీసుల పేర్లతో బెదిరించిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడుతూ లారీడ్రైవర్‌పై దాడి చేసిన వారిని అదుపులో తీసుకున్నారు. మాధవరావు హర్ష, నాగరాజుపై కేసు నమోదు చేశారు. అన్ని అనుమతులతో ఇసుక తీసుకొచ్చి.. అన్లోడ్ చేసిన తర్వాత తిరిగి వెళ్తున్న క్రమంలో లారీని ఆపి బెదిరించారు. వారిపై కేసు నమోదు చేశామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

ప్ర‘యోగం’ ఉన్నట్లే..

- ల్యాబ్ నిర్వహణకు నిధులు
- పూర్తిస్థాయిలో ప్రాక్టికల్స్ చేయనున్న ఇంటర్ విద్యార్థులు
- కళాశాలలకు రూ.25 వేలు విడుదల



కారేపల్లి జూనియర్ కాలేజీలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని ఇంటర్మీడియట్ కళాశాలల్లో ల్యాబ్‌ల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. సైన్స్ గ్రూపులకు సంబంధించి ఇంటర్మీడియట్‌లో ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం ల్యాబ్‌ల్లో పరికరాలను ఏర్పాటు చేసేందుకు కళాశాలలకు రూ.25 వేల చొప్పున నిధులు విడుదల చేసింది. జిల్లాలోని మొత్తం 21 జూనియర్ కళాశాలలకు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో కళాశాలలకు కావాల్సిన పరికరాలను కొనుగోలు చేస్తున్నారు.

అంతంత మాత్రంగానే..

ఇంటర్మీడియట్‌లో కెమిస్ట్రి, ఫిజిక్స్, బయాలజీ వంటి సబ్జెక్టులు చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయడం ప్రధానం. అయితే ప్రభుత్వ కళాశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రయోగాలు చేయడం విద్యార్థులకు కష్టంగా మారుతోంది. గత 8, 9 ఏళ్లుగా ల్యాబ్ పరికరాలను ప్రభుత్వాలు అందజేయలేదు. దీంతో పాడైన వాటిని, స్థానికంగా ఇతరుల సాయంతో తెచ్చుకుని ప్రయోగాలను మమ అనిపిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు కూడా ఈ ప్రయోగాలపై ఆసక్తి చూపించలేకపోతున్నారు. ల్యాబ్‌లు పురాతన కాలం నాటివి కావడంతో ప్రయోగాలు చేసేందుకు లిక్విడ్ కూడా దొరకడం లేదు. దీంతో స్థానికంగానే కొనుగోలు చేసుకుంటున్నారు.

రూ.25 వేలు చొప్పున..

కళాశాలల్లో అభ్యసిస్తున్న సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ అత్యవసరం అని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ల్యాబ్‌ల్లో పరికరాలు కొనుగోలు చేసుకునేందుకు కళాశాలలకు రూ.25 వేల చొప్పున నిధులను విడుదల చేసింది. జిల్లాలో గతంలో 19 కళాశాలలు ఉండగా.. గత ఏడాది కందుకూరులో ఒక కాలేజీ ప్రారంభమైంది. ప్రస్తుతం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచిలో కొత్త కాలేజీ వచ్చింది. కొత్తగా ఏర్పాటైన రెండు కాలేజీల్లో ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు, లిక్విడ్ అందుబాటులో లేవు. ఇక్కడ వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇక మిగిలిన కళాశాలల్లో పాడైపోయిన పరికరాలు, అత్యవసరమైన వాటిని కొనుగోలు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ తప్పనిసరి. ప్రాక్టికల్స్‌తోపాటు పరీక్షల నిర్వహణ కోసం పరికరాలు, లిక్విడ్ వంటివి కొనుగోలు చేసుకునేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ రూ.25 వేల నిధులతో అవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. విద్యార్థులను పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఖమ్మం

ఆవిర్భావం అదిరేలా..!

సింగరేణి డే వేడుకలకు సిద్ధం

- ముస్తాబైన ప్రకాశం స్టేడియం
- ముఖ్యఅతిథిగా సింగరేణి సీఎండీ
- సాధించిన అభివృద్ధి తెలిపేలా 27 స్టాళ్ల ఏర్పాటు



విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తూ.. లక్షలాది మందికి జీవనోపాధి కలుగజేస్తున్న సింగరేణి సంస్థ ఈనెల 23న ఆవిర్భావ వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమైంది. అనేక సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వరంగ సంస్థలకే తలమానికంగా మారి 136 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థ సింగరేణి డే వేడుకలు పేరిట నేడు కోల్‌బెల్ట్ ప్రాంతంలోని అన్ని ఏరియాల్లో నిర్వహించనున్నారు. ఈనేపథ్యాన కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ప్రకాశం స్టేడియంలో ప్రధాన వేడుకలు జరిపేందుకు ముస్తాబుచేయగా.. సంస్థ అభివృద్ధి, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసేలా స్టేడియంలో సంస్థ దాదాపు 27 స్టాళ్లను ఏర్పాటు చేస్తుంది.

తొలిసారి సీఎండీ రాక..

సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో బలరామ్ తొలిసారిగా ఈ వేడుకలకు హాజరుకానున్నారు. ఈ క్రమంలో వేడుకలకు వచ్చే కార్మికులు, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంస్థ తగిన ఏర్పాట్లు చేస్తుంది. జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరి శ్రీనివాస్‌రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తూ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ముస్తాబైన ప్రధాన కార్యాలయం

సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముస్తాబైంది. సింగరేణి డైరెక్టర్లు తొలుత ఈ కార్యాలయంలో పతాకావిష్కరణ చేయనుండగా కార్యాలయ ఆవరణలో తివాచీలు ఏర్పాటు చేశారు. అలాగే కార్యాలయం ముందు, లోపల భాగాల్లో విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. రాత్రి సమయంలో శుభాకార్యాన్ని తలపించేలా కార్యాలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు.

ప్రత్యేక ప్రదర్శనలు..

సాయంత్రం ప్రముఖ సినీ గాయకులు ధనుంజయ్, ప్రణిత, శృతిక, సముద్రాలచే సినీ సంగీత విభావరి, తరువాత సీతా ప్రసాద్ బృందంచే ప్రత్యేక నృత్య ప్రదర్శనలు, ఈటీవీ ఢీ విజేత బాబీ టీమ్ నృత్య ప్రదర్శన, ఆ తర్వాత ఇండియన్ టాప్ మెజీషియన్ అలీచే మ్యాజిక్ షో, చెన్నై కళాకారులు ట్విన్ జగ్లర్స్, అశోక్– ఆనంద్ వారి స్పెషల్ యాక్ట్ ప్రదర్శించనుండగా యాంకర్‌గా విజయ వ్యవహరించనున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. మండలంలోని రాయగూడేనికి చెందిన పలువురు అసభ్యకరంగా ప్రవర్తించారని బోయిన నాగరాణి ఆరోపించారు. దీంతో అదే గ్రామానికి చెందిన మరో వర్గం అదివారం ఘర్షణకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో తమ పట్ల అసభ్యకరంగా వ్యవహరించటమే కాకుండా.. తన భర్తను చంపుతామని హెచ్చరిస్తున్నారని ఫిర్యాదు నాగరాణి ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా సదరు మహిళ అకారణంగా తమను దూషించినట్లు గ్రామానికి చెందిన సాయి, సారథి ఆరోపించారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఓ లాడ్జిలో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణం వికలాంగుల కాలనీకి చెందిన వీరస్వామి(35) ఆదివారం స్థానికంగా ఓ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. సాయంత్రం దాకా రూమ్ నుంచి ఎటువంటి అలికిడి లేకపోవడంతో లాడ్జి సిబ్బంది డోర్ తీసి చూడగా వీరస్వామి ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, వీరస్వామి తన భార్య ఫొటోను గుండెలపై అతికించుకుని ఉండడంతో కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్రాభివృద్ధికి భవిష్యత్ పోరాటాలు..



సమావేశంలో మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా సమగ్ర అభివృద్ధికి భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కానున్నట్లు సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం నూతన జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక మంచికంటిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈమేరకు రెండు రోజులపాటు ఇల్లెందులో జరిగిన జిల్లా మహాసభలో ప్రజాసమస్యలపై ఆమోదించిన తీర్మానాలను వెల్లడించారు. అంతేకాక మూడేళ్ల కాలంలో పార్టీ ఆధ్వర్యాన సాధించిన విజయాలు సమీక్షించుకుని జిల్లాభివృద్ధికి అవసరమైన పోరాటాల రూపకల్పన చేశామన్నారు. ఇందులో సీతారామ ప్రాజెక్ట్ విషయంలో జిల్లాకు అన్యాయం జరుగుతుందని, జిల్లాభివృద్ధికి నిధులు తీసుకురావడంలో ముగ్గురు మంత్రులు వివక్షత చూపుతున్నారని, జిల్లాలో కొత్త పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నా పట్టించుకోవడం లేదని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్న పట్టించుకోవటం లేదని, పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇచ్చేలా భవిష్యత్ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అంతేకాక వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని, వైద్య పోస్టులను భర్తీ చేయాలని, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీలకు, సారపాక భద్రాచలం పంచాయతీలకు ఎన్నికలు జరిపి ప్రజా పాలన అందించాలని మహాసభ తీర్మానం చేసిందన్నారు. అలాగే విమానాశ్రయం నిర్మాణం పేపర్లకే పరిమితం కాకుండా ఆచరణలో తేవడానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఫ్రెండ్ రిక్వెస్ట్‌తో యువకుడికి వల

రూ.16 లక్షలు చోరీ

ఖమ్మంక్రైం: ఓ యువకుడు, యువతి కలిసి జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో సైబర్ క్రైమ్‌కు పాల్పడ్డారు. తమ ఫేస్‌బుక్ ఖాతాకు సంబంధించి పేరు మార్చుకొని వల విసరటం ప్రారంభించారు. యువతి ఓ యువకుడి వద్ద భారీగా డబ్బును చోరీచేసింది. సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్ కథనం ప్రకారం.. విశాఖపట్టణం జిల్లా నాయుడుతోట గ్రామానికి చెందిన వంకర లావణ్య, భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైరేసారం గ్రామానికి చెందిన సరిపల్లి శ్రీకాంత్ ఇద్దరు మిత్రులు. వారు జల్సాలకు అలవాటు పడి సైబర్ నేరాల ద్వారా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. దీంతో రింకులావణ్య అనే పేరుతో లావణ్య ఫేస్‌బుక్ ఖాతా ఓపెన్ చేసి పురుషులకు ఫ్రెండ్ రెక్వెస్టులు పెట్టేది. సత్తుపల్లికి చెందిన ఓ యువకుడుడు రెక్వెస్టను యాక్సెప్ట్ చేశాడు. దీంతో ఇద్దరు కొన్ని రోజులు చాటింగ్ చేసుకున్నారు. తర్వాత లావణ్య అతడి వాట్సాప్ నంబర్ తీసుకొని రోజూ మాట్లాడేది. అప్పుడప్పుడూ నగదు తీసుకునేది. తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని నగదు కావాలని అడుగగా భారీగా డబ్బు పంపించాడు. కొంతకాలం తర్వాత డబ్బు ఇవ్వమని అడుగగా శ్రీకాంత్‌తో బాధితుడికి ఫోన్ చేయించి బెదిరించింది. అతడు.. తన చెల్లికి ఫోన్ చేసి బెదిరిస్తున్నావని, చాటింగ్, మిగతా ఆధారాలున్నాయని, ఫొటోలు కూడా సోషల్ మీడియాలో పెడతామని బెదిరించి విడతల వారిగా మొత్తం రూ.16,05,000 లాగారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్ తెలిపారు. నిందితులను వైజాక్‌లో పట్టుకుని ఖమ్మంలో రిమాండ్ చేశామని, కేసు ఛేదించిన ఎస్‌ఐ రంజిత్, సిబ్బంది నాగేశ్వరరావు, శ్రీనివాసరావును ఈ సందర్భంగా అభినందించారు.

వేధింపులపై కేసు నమోదు

ఇల్లెందు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురు వ్యక్తులపై ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నంబర్ 2 బస్తీకి చెందిన ఎల్లబోయిన రేవతిని తన భర్త ప్రణయకుమార్, అత్తా మామలు రవ, సమ్మయ్యలు అదనపు కట్నం కోసం గత కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యాన రేవతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురుపై ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



గాయపడిన ఉషను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఆరుగురు గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెరువుమాధారం గ్రామానికి చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన ఆరుగురు ఆదివారం రాత్రి ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. అజయ్‌తండా శివారుకు రాగానే.. ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మీబాయి (70), ఉషా (38), పద్మ (55), ఈశ్వరమ్మ (45), సుమతి (30)తో పాటు సురేఖ (11)కు గాయాలయ్యాయి. కాగా, లక్ష్మీబాయి, ఉషాకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం తరలించారు.

రెండు ఇళ్లలో చోరీకి యత్నం

ఖమ్మంక్రైం: నగరంలోని రెండు ఇళ్లలో చోరీకి యత్నించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మామిళ్లగూడెం, గాయత్రిభవన్ ప్రాంతంలో నివాస గృహాల్లో దొంగలు చోరీలకు ప్రయత్నించినట్లు వారు పేర్కొన్నారు. అయితే ఈ ఘటనలో రెండు నివాసాల్లో కూడా ఎలాంటి ఆస్తి చోరీ గురి కాలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలపరిధిలోని సీతారాంపురం శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టీఎస్ఎస్‌పీ ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బానోత్ నెహ్రూ తన ద్విచక్ర వాహనంపై పాల్వంచకు వెళ్తున్నాడు. ఈక్రమంలోనే మండలపరిధిలోని చలమన్ననగర్‌కు చెందిన ఓర్సు అంజి(30) బైక్‌పై పాల్వంచ నుంచి ఇంటికి వస్తున్నాడు. దీంతో సీతారాంపురం శివారులోని రాగానే అంజి లారీని ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న నెహ్రూ బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో అంజి ఘటనా స్థలంలోనే ప్రాణాలో కోల్పోగా.. నెహ్రూకి తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను స్థానికులు ఇలా తెలిపారు. మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన కనుకు వెంకటరామయ్య శనివారం సాయంత్రం భద్రాచలం నుంచి వచ్చిన ఆటో దిగి రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో చర్ల వైపు నుంచి ట్రిపుల్ రైడింగ్‌తో ఓ ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వెంకటరామయ్య కాలు విరగగా స్థానికులు 108 ద్వారా భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకులు చర్ల మండలానికి చెందిన వారిగా గుర్తించారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించండి..



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆయనను వెంటనే భర్తరఫ్ చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఆదివారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మంలోని ధర్నాచౌక్ నుంచి జిల్లా పరిషత్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం జరిగిన సభలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర, జిల్లా నాయకులు నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, సీవై పుల్లయ్య, హుస్సేన్ మాట్లాడారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అమిత్‌షా హోంమంత్రి అయ్యారని గుర్తు చేశారు. దేశంలో కులం, మతం, ప్రాంతం ఆధారంగా సమాజ మనుగడ ఉండకూడదని అంబేడ్కర్ భావించారని, ఆ మేరకు రాజ్యాంగంలో రక్షణలు ఏర్పాటు చేశారని వివరించారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, పేదలకు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే రక్షణగా ఉందని అభిప్రాయపడ్డారు. రాజకీయాల కోసం ఏది పడితే అది రాజ్యాంగ సభలో మాట్లాడటం అమిత్‌షా అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు అంబేడ్కర్ పేరు జపం చేసి, అధికారంలోకి వచ్చిన బీజేపీ నేడు అంబేడ్కర్ పేరు ఎత్తగూడదని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, మాదినేని రమేష్, దండి సురేష్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తాటి నిర్మల, ఆవుల అశోక్, ఝాన్సీ, ఎం.సుబ్బారావు, నందిపాటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలు బోధించేలా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న నామాల ఆజాద్

ఖమ్మంమామిళ్లగూడెం: కేజీబీవీల్లో పాఠ్యాంశాల బోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం అర్బన్ కేజీబీవీ ఎదుట నిరసన చేపట్టగా ఆజాద్ మాట్లాడారు. కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో పాఠాలు నడవకపోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇంకా మూడు నెలల్లో పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు ఉన్నాయని, విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల్ని విద్యాలయాల్లోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యశ్వంత్, స్టాలిన్, కార్తీక, దీపిక, నవీన, సంధ్య, స్వరూప, అనూష, దీప్తి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు పూర్వ వైభవం తెస్తా

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- వైభవంగా కళాశాల స్వర్ణోత్సవాలు



ఎమ్మెల్యే కూనంనేనిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ తదితరులు

పాల్వంచరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వవైభవాన్ని తీసుకొస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని బస్వతారాకకాలనీ గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో వేడుకలు సాగాయి. ఎమ్మెల్యే కళాశాల ప్రాంగణంలోని సరస్వతిదేవికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు పూర్వగురువులను కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలకు ప్రహరీ, అదనపు తరగతి గదులు మంజూరు కోసం కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, జిల్లా ఇంటర్ విద్యాధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, పూర్వపు ప్రిన్సిపాల్స్ విజయ పూర్ణిమ, రామచందర్, శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబిర్‌పాషా, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డలో ఆదివారం గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై ఎం.రమాదేవి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వేపలగడ్డ ధనలక్ష్మి వెంచర్ సమీపంలో కొంతమంది వ్యక్తుల వద్ద గంజాయి ఉందన్న సమాచారంతో ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుల్ ఓ.చంద్రశేఖర్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కలిసి దాడి చేశారు. దీంతో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.45,525 విలువ గల గంజాయి, స్కోడా కారు, ఒక హోండా స్కూటీ, ఏడు సెల్ ఫోన్లు స్వాధీన పరచుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారిలో చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీకి చెందిన రాహుల్, బొంకూరు రోహిత్, రామవరం నాగయ్యగడ్డకు చెందిన పర్లపల్లి ఉదయ్‌కిరణ్, చుంచుపల్లికి చెందిన ముప్పాల అభిషేక్, నిఖిల్, కొత్తగూడెం రామటాకీస్ ఏరియాకు చెందిన సిర్ల సాయికిరణ్, విద్యానగర్‌కు చెందిన మనబోతుల సాత్విక్ ఉన్నారు.